సమాచార శాఖపై.. అవినీతి ‘బాణం’

ఐ అండ్ పీఆర్ శాఖలో భారీ అవినీతి

- వర్క్ ఆర్డర్లన్నీ ‘యారో అడ్వర్టైజింగ్ ఏజెన్సీ’ కే
- మార్చిలోనే దాని అక్రెడిటేషన్‌ను సస్పెండ్ చేసిన ఐఎన్‌ఎస్
- అయినా రూ. పదుల కోట్ల ప్రకటనలు ఇచ్చిన సమాచార శాఖ
- మంత్రి సూచించిన కంపెనీని పక్కన పెట్టి మరీ ప్రకటనలు జారీ
- తెరవెనుక వ్యవహారం నడిపించిన ‘బిగ్ బ్రదర్స్’

హైదరాబాద్, సెప్టెంబర్ 26 (నమస్తే తెలంగాణ): ‘ఇందుగలడందులేడు..’ అన్నట్టుగా ప్రభుత్వంలోని అన్ని శాఖలపై బిగ్ బ్రదర్స్ పంజా విసురుతున్నారు. తాజాగా సమాచార, ప్రజా సంబంధాల శాఖపై (ఐ అండ్ పీఆర్) ‘బాణం’ విసిరారు. వారి అండతో ఐ అండ్ పీఆర్ విభాగంలో కొన్ని నెలలుగా విచ్చలవిడిగా భారీ అవినీతి బాగోతం జరుగుతున్నది. అధికారిక గుర్తింపు లేని సంస్థకు అక్రమంగా రూ.పదుల కోట్ల ప్రకటనలు కట్టబెడుతున్నారు. ఈ క్రమంలో మంత్రి సిఫారసు చేసిన సంస్థను సైతం పక్కన పడేసి.. ‘ఇండియన్ న్యూస్ పేపర్స్ సొసైటీ’ సస్పెండ్ చేసిన ఏజెన్సీకి విచ్చలవిడిగా వర్క్ ఆర్డర్లు ఇవ్వడం గమనార్హం. ఐ అండ్ పీఆర్ తాజాగా రూపొందించిన ప్యానల్ ఏజెన్సీల్లో ఆ సంస్థ లేకపోవడం మరో విచిత్రం.

ఏజెన్సీలు.. అనుసంధానకర్తలు

ప్రభుత్వం ఏదైనా అంశంపై పత్రికల ద్వారా ప్రచారం చేయాలనుకున్నప్పుడు అడ్వర్టైజింగ్ ఏజెన్సీ ద్వారా పత్రికలకు ప్రకటనలు జారీ చేస్తుంది. ఢిల్లీ కేంద్రంగా నడిచే ‘ద ఇండియన్ న్యూస్‌పేపర్ సొసైటీ’ దేశవ్యాప్తంగా ఉన్న అడ్వర్టైజింగ్ ఏజెన్సీలకు అక్రెడిటేషన్ (గుర్తింపు) ఇస్తుంది. ఆ అక్రెడిటేషన్ ఉన్న ఏజెన్సీల్లో కొన్నింటిని ఐ అండ్ పీఆర్ విభాగం ఎంచుకుంటుంది. వీటిని ప్యానల్ ఏజెన్సీలు అని పిలుస్తారు. ప్రతి మూడేండ్లకు ఒకసారి జాబితాను రెన్యువల్ చేస్తుంది. ఈ ఏజెన్సీలు ప్రభుత్వానికి, పత్రికలకు మధ్య అనుసంధాన కర్తలుగా వ్యవహరిస్తుంటాయి. ప్రభుత్వం ఇచ్చే ప్రకటనలకు సంబంధించి డిజైన్ రూపొందించడం, వాటిని పత్రికలకు ఇవ్వడం, ప్రభుత్వం నుంచి బిల్లులు వసూలు చేసి పత్రికలకు అందజేయడం వంటివి వాటి బాధ్యత. ప్రభుత్వం ఒక ప్రకటన జారీ చేసే ముందు డిజైన్లు సమర్పించాలని ప్యానల్ ఏజెన్సీలకు సూచిస్తుంది. ఉత్తమ డిజైన్‌ను గుర్తించి ఆ ఏజెన్సీకి వర్క్ ఆర్డర్ ఇచ్చి, ప్రకటనలు జారీ చేస్తుంది. ప్రకటన జారీ అయిన 60 రోజుల్లోగా ఏజెన్సీలు ప్రభుత్వం నుంచి బిల్లులు వసూలు చేయించి, పత్రికలకు చెల్లించాల్సి ఉంటుంది. ఇందులో కొంత భాగం ఏజెన్సీలకు కమిషన్‌గా వెళ్తుంది. ఈ ఏజెన్సీల పనితీరుపై ఎప్పటికప్పుడు ఐఎన్‌ఎస్ సమీక్షిస్తుంది. సరిగా పనిచేయని ఏజెన్సీల అక్రెడిటేషన్‌ను సస్పెండ్ చేస్తుంది.

మార్చిలోనే సస్పెన్షన్.. అయినా ఆర్డర్

రాష్ట్రంలో దాదాపు 50కిపైగా ప్యానల్ ఏజెన్సీలు ఉన్నాయి. ఇందులో ‘యారో అడ్వర్టైజింగ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్’ ఏజెన్సీ ఒకటి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు దాదాపు రూ.110 కోట్ల మేర పత్రికలకు ప్రకటనలు ఇచ్చినట్టు సమాచారం. ఇందులో 80-90 శాతం ప్రకటనల ఆర్డర్లు యారో అడ్వర్టైజింగ్ ఏజెన్సీకే దక్కాయని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అయితే.. యారో అడ్వర్టైజింగ్ ఏజెన్సీ అక్రెడిటేషన్‌ను ఐఎన్‌ఎస్ ఈ ఏడాది మార్చి 22న సస్పెండ్ చేసింది. సంస్థ నుంచి పత్రికలకు బిల్లుల చెల్లింపుల తీరు సరిగా లేకపోవడం వల్ల ఈ నిర్ణయం తీసుకుంటున్నట్టు అందులో పేర్కొన్నారు. అయినా రాష్ట్ర ప్రభుత్వం ఆగకుండా ‘యారో’ కంపెనీకి ప్రకటనల ఆర్డర్లు కట్టబెడుతూనే ఉన్నది. తాజాగా.. ఈ నెల 13వ తేదీన రైతులకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ, సీతారామా లిఫ్ట్ ప్రారంభానికి సంబంధించిన ప్రకటనలను యారో ఏజెన్సీ ద్వారానే ఇచ్చింది. మొత్తం 31 పత్రికల్లో ప్రకటనలకు రూ.10.10 కోట్ల ఆర్డర్ ఇచ్చారు. ఇదొక్కటే కాదని, ఐఎన్‌ఎస్ సస్పెండ్ చేసిన తర్వాత ఐ అండ్ పీఆర్ నుంచి రూ.పదుల కోట్ల వర్క్ ఆర్డర్ ఇచ్చిందని చెప్తున్నారు. జూన్‌లోనూ రూ.1.50 లక్షల వరకు రుణమాఫీ పేరుతో 31 పత్రికలకు రూ.7.34 కోట్ల వర్క్ ఆర్డర్ ఇచ్చిందని చెప్తున్నారు. వారం రోజుల కిందట ఐ అండ్ పీఆర్ విభాగం తయారుచేసిన ప్యానల్ ఏజెన్సీల జాబితాలోనూ యారో సంస్థకు చోటు దక్కలేదు. దీనిని బట్టే కంపెనీ పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.


GOVERNMENT OF TELANGANA
DEPARTMENT OF INFORMATION & PUBLIC RELATIONS: HYDERABAD.

‘యారో’కు ప్రకటనలిస్తూ ఐ అండ్ పీఆర్ ఇచ్చిన ఆర్డర్, ‘యారో’కు అక్రెడిటేషన్ రద్దు చేస్తూ ఐఎన్‌ఎస్ ఆర్డర్

మంత్రి చెప్పినా పట్టించుకోలే

యారోతో సమానంగా తమ సన్నిహితులకు చెందిన కంపెనీకి కూడా వర్క్ ఆర్డర్లు ఇవ్వాలని ఓ మంత్రి స్వయంగా ఈ ఏడాది మార్చిలో సిఫారసు చేసినట్టు సమాచారం. దీంతో మొహమాటానికి రెండు నెలలపాటు కొంత ఆర్డర్లు ఇచ్చారని చెప్పుకుంటున్నారు. కానీ.. ఆ తర్వాత మళ్లీ ఆర్డర్లు మొత్తం యారో కంపెనీకే కట్టబెట్టారని చెప్పుకుంటున్నారు. అదేమని అడిగితే.. ఎవరికి ప్రకటనలు ఇవ్వాలో ‘బిగ్ బ్రదర్స్’ ఆదేశిస్తున్నారని, తాము పాటిస్తున్నామని అధికారులు చెప్తున్నారని సమాచారం. సాధారణంగా ప్రభుత్వాలు ఒక ప్రకటనను రెండుమూడు ఏజెన్సీలకు కలిపి ఇస్తుందని, దీంతో అన్నింటికీ పని దొరుకుతుందని చెప్తున్నారు. ఒకటి రెండు ఏజెన్సీలకు కొద్దిగా ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వడం కూడా సహజమేనన్నారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం మొదటి నుంచీ ఏకపక్షంగా యారోకే వర్క్ ఆర్డర్లు ఇచ్చినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో మిగతా ఏజెన్సీలకు పనిలేకుండా, దివాళా తీసే పరిస్థితి తలెత్తిందని నిర్వాహకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

బిల్లులు ఎలా చెల్లిస్తారు?

ఐఎన్‌ఎస్ ప్రకారం యారో అడ్వర్టైజింగ్ ఏజెన్సీ గుర్తింపు ఈ ఏడాది మార్చిలోనే రద్దయింది. నిబంధనల ప్రకారం ఆ ఏజెన్సీకి ఐ అండ్ పీఆర్ వర్క్ ఆర్డర్ ఇవ్వరాదు. కానీ తెలంగాణలో యారో ఏజెన్సీకి మార్చి తర్వాత సైతం విచ్చలవిడిగా వర్క్ ఆర్డర్లు జారీ అయినట్టు చెప్తున్నారు. మరి గుర్తింపు లేని కంపెనీకి ప్రభుత్వం బిల్లులు ఎలా చెల్లిస్తుందని నిపుణులు ప్రశ్నిస్తున్నారు. యారో ఏజెన్సీ బాగోతం తెలిసిన కొన్ని పత్రికలు ఆ ఏజెన్సీ ఇచ్చిన ప్రకటనలు వేసేందుకు ఒప్పుకోలేదట. దీంతో థర్డ్ పార్టీ ఏజెన్సీల ద్వారా ప్రకటనలు వేయించినట్టు చెప్పుకుంటున్నారు. ఇది కూడా నిబంధనలకు విరుద్ధమని స్పష్టం చేస్తున్నారు. మరి పత్రికలకు ఆ బిల్లులు ఎలా చెల్లిస్తున్నారని ప్రశ్నిస్తున్నారు. ఐ అండ్ పీఆర్ శాఖలో జరిగిన ఈ అవినీతిని పూర్తిగా వెలికితీసి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.

‘రామప్ప’ను కాపాడుకోవాలి

- ఆలయం దగ్గరలో ఓపెన్‌కాస్ట్ వద్దు
- సుప్రీం కోర్టు గైడ్‌లైన్స్ పాటించాలి
- బీఆర్‌ఎస్ ములుగు జిల్లా అధ్యక్షుడు కాకుల మర్రి లక్ష్మీనర్సింహారావు

ములుగు, సెప్టెంబర్ 26 (నమస్తే తెలంగాణ) : ములుగు జిల్లా వెంకటాపూర్ మండలంలోని రామప్ప ఆలయాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉన్నదని బీఆర్‌ఎస్ ములుగు జిల్లా అధ్యక్షుడు కాకుల మర్రి లక్ష్మీనర్సింహారావు అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఇటీవల రామప్ప ఆలయం వర్షాలకు కురవడం, గొల్లగుడిని గుర్తుతెలియని దుండగులు ధ్వంసం చేసి గుప్తనిధుల కోసం శివలింగాన్ని తొలగించడం బాధాకరమని చెప్పారు. సుప్రీంకోర్టు గైడ్‌లైన్స్‌ను పాటించకుండా సింగరేణి ఓపెన్ కాస్ట్ పనులు చేపడితే ఊరుకునేది లేదని, ప్రజలతో కలిసి ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు.

సొంత గూటికి హౌసింగ్ కార్పొరేషన్ ఉద్యోగులు

ఇందిరమ్మ ఇండ్ల కోసం డిప్యూటేషన్ రద్దు

హైదరాబాద్, సెప్టెంబర్ 26(నమస్తే తెలంగాణ): వివిధ ప్రభుత్వ శాఖలు, కార్పొరేషన్లలో డిప్యూటేషన్‌పై పనిచేస్తున్న తెలంగాణ రాష్ట్ర గృహనిర్మాణ సంస్థ(టీజీహెచ్‌సీఎల్) ఉద్యోగులు తిరిగి సొంత గూటికి చేరుకోనున్నారు. వారి డిప్యూటేషన్‌ను రద్దు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఇందిరమ్మ ఇండ్ల పథకం అమలు కోసం ప్రభుత్వం ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్టు ఉత్తర్వుల్లో పేర్కొంది. హౌసింగ్ కార్పొరేషన్‌కు చెందిన మొత్తం 242 మంది రెగ్యులర్ ఉద్యోగులు డిప్యూటేషన్‌పై వివిధ శాఖల్లో పనిచేస్తుండగా, అందులో కలెక్టర్ ఆఫీసుల్లో పనిచేస్తున్న 148 మంది, టీజీఆర్‌ఎస్‌సీఎల్‌లో పనిచేస్తున్న 9 మంది మినహా మిగిలినవారు తమ సొంత శాఖకు బదిలీ అయ్యేలా ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది.

అధికారికంగా ‘కాకా’ వర్ధంతి

హైదరాబాద్, సెప్టెంబర్ 26 (నమస్తే తెలంగాణ): మాజీ కేంద్ర మంత్రి జీ వెంకటస్వామి (కాకా) వర్ధంతిని అధికారికంగా నిర్వహిస్తున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది. ఇకపై ఏటా డిసెంబర్ 22న అధికారికంగా నిర్వహిస్తామని గురువారం సీఎస్ శాంతికుమారి ఉత్తర్వులు జారీచేశారు.

తప్పుల తడకగా జీవోలు

హైదరాబాద్, సెప్టెంబర్ 26 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వం విడుదల చేస్తున్న అనేక జీవోలు తప్పుల తడకగా ఉంటున్నాయి. అధికారులు నిర్లక్ష్యంగా జీవోలు విడుదల చేస్తుండటంతో ప్రభుత్వం అభాసుపాలవుతున్నది. తాజాగా మాజీ కేంద్ర మంత్రి జీ వెంకటస్వామి వర్ధంతిని అధికారికంగా నిర్వహిస్తున్నట్టుగా గురువారం విడుదలైన జీవోలో కాకాను మాజీ ఎంపీగా మాత్రమే సంబోధించారు. తర్వాత నాలుక కరుచుకొని, మార్పులు చేశారు. ఇటీవల విజిలెన్స్ కమిషన్‌గా మాజీ ఐఏఎస్ అధికారి ఎంజీ గోపాల్‌ను నియమిస్తూ విడుదల చేసిన జీవోలో 2022గా పేర్కొన్నారు. వైద్యారోగ్య శాఖ విడుదల చేసిన ల్యాబ్ టెక్నీషియన్ రిక్రూట్‌మెంట్ ఉత్తర్వుల్లో 2023గా పేర్కొన్నారు. ఇలా అనేక జీవోల్లో పాత తేదీలనే కొనసాగించారు. పర్యవేక్షణ లోపంతోనే తప్పులు జరుగుతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి.

ఓరుగల్లు టూరిజానికి బొగ్గు మసి

- రామప్ప వద్ద మైనింగ్‌తో పెనుముప్పు
- రామప్ప చెరువు, కోటగుళ్లు, లక్నవరం, మేడారంపైనా ‘ఓపెన్ కాస్ట్’ ప్రభావం
- ఇప్పటిదాకా ఎటుచూసినా ఆహ్లాదకరం
- తెలంగాణకు తలమానికంగా పర్యాటక ప్రాంతం
- బొగ్గుగనితో బొందలగడ్డగా మారే ప్రమాదం

వరంగల్, సెప్టెంబర్ 26 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : రామప్ప ఆలయం అనగానే గుర్తుకొచ్చేది ఓరుగల్లు.. అనేక పర్యాటక ప్రాంతాలతో అలరారుతూ విదేశీ పర్యాటకులను సైతం ఆకర్షిస్తున్న ఈ ‘కాకతీయ సామ్రాజ్యం’లో రామప్ప ఆలయానికే కాదు, దాని దరిదాపులో ఉన్న రామప్ప చెరువు, లక్నవరం సరస్సు, కోటగుళ్లు, సమ్మక్క-సారలమ్మలు కొలువైన మేడారంపైనా ‘మైనింగ్’ ప్రభావం తీవ్రంగా పడనున్నది. ప్రశాంతతకు, పర్యావరణ సమతుల్యానికి చిరునామాగా నిలిచిన ఈ ప్రాంతమంతా సింగరేణి ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటుచేసే ‘ఓపెన్ కాస్ట్’గనితో బొందలగడ్డగా మారనున్నది. పచ్చని చెట్లు, గుట్టలు, సరస్సులు, కాయతీయుల ఆలయాలన్నీ మట్టికొట్టుకుపోయే ప్రమాదమున్నది. గని నుంచి తవ్విపోసిన బూడిద కొండలతో ఈ ప్రాంతాన్ని వరదలు కూడా ముంచెత్తే అవకాశమున్నది.

మిగిలేది బూడిదే..!

దేశ విదేశాల నుంచి వచ్చే భక్తులు, సందర్శకులకు రామప్ప రిలీఫ్ ఇచ్చే ఎకో టూరిజం స్పాట్‌గా అవతరించింది. దేశంలోనే గొప్ప పర్యాటక ప్రదేశంగా మారింది. యునెస్కో గుర్తింపు తర్వాత ఆలయానికి వచ్చే భక్తులు, పర్యాటకుల సంఖ్య విపరీతంగా పెరిగింది. రామప్ప కేంద్రంగా చుట్టూ 25 కిలోమీటర్ల వరకు పర్యాటక ప్రదేశానికి నెలవుగా మారింది. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వ చర్యలతో ఇప్పుడు ఈ ప్రదేశం ఉనికే ప్రమాదంలో పడింది. పర్యాటక ప్రాంతం నడిబొడ్డున ఏర్పాటయ్యే సింగరేణి కాలరీస్ కంపెనీ ఓపెన్ కాస్టు మైనింగ్‌తో ఈ ప్రదేశమంతటా బూడిదే వ్యాపించనున్నది. గనిలో పేలుళ్లతో సుమారు రెండు కిలోమీటర్ల వరకు భూ ప్రకంపనలు ఉంటాయి. బొగ్గు పెళ్లలు, రాళ్లు కిలోమీటర్ల దూరం వరకు ఎగిరి పడతాయి. పేలుళ్ల కారణంగా భూపాలపల్లిలోని ఓపెన్ కాస్ట్ సమీపంలో ఉన్న దుర్గంరామయ్యగడ్డలో ఇండ్లను సింగరేణి అధికారులు ఖాళీ చేయించారు. గడ్డిగానిపల్లిని తరలించేందుకు ఏర్పాట్లు కూడా పూర్తయ్యాయి. గణపురం మండలంలో కొనసాగుతున్న ఓపెన్ కాస్టు 3 పరిధిలోని మాధవరావుపల్లినీ ఖాళీ చేయించారు. కొండంపల్లిని తరలించే ప్రక్రియ వేగవంతం చేశారు.

ఇక్కడే ఎందుకు?

సింగరేణి కాలరీస్ కంపెనీ పరిధిలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నుంచి మంచిర్యాల వరకు బొగ్గు నిక్షేపాలు, గనులు విస్తారంగా ఉన్నాయి. బొగ్గు ఉన్నట్టు నిర్ధారించి తవ్వకాలు మొదలుపెట్టేందుకు సిద్ధంగా ఉన్న ప్రాంతాలున్నాయి. ఇవన్నీ పక్కనబెట్టి సింగరేణి కాలరీస్ కంపెనీ రామప్ప ప్రాంతంలోనే ఓపెన్‌కాస్ట్ గనుల ఏర్పాటు కోసం వేగంగా కదులుతుండడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. బొగ్గు అందరి అవసరాలు తీర్చేదైనప్పటికీ చారిత్రక సంపద, పర్యావరణం, జీవావరణాన్ని దెబ్బతీసేలా ఈ ప్రాంతంలో ఓపెన్ కాస్టులు ఏర్పాటు చేయడం సరికాదని పర్యావరణ, పురావస్తు నిపుణులు అంటున్నారు. సింగరేణి కాలరీస్ కంపెనీకి భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని ఓపెన్ కాస్టు 1 మూతపడగా.. ఓపెన్ కాస్ట్, గణపురం మండలంలోని ఓపెన్ కాస్టు 3లో బొగ్గు ఉత్పత్తి జరుగుతున్నది. దీనికి కొనసాగింపుగా రామప్ప ఆలయం ఉన్న వెంకటాపూర్ మండలం మీదుగా ములుగు వరకు ఓపెన్ కాస్టు 4, ఓపెన్ కాస్టు 5 గనుల ఏర్పాటుకు భూసేకరణ పనులు వేగంగా జరుగుతున్నాయి.

బూడిద గుట్టలతో వరద ముంపు

ఆరు జిల్లాల పరిధిలో సింగరేణి సంస్థ బొగ్గు గనులు విస్తరించి ఉన్నాయి. ప్రస్తుతం 22 భూగర్భ, 18 ఓపెన్ కాస్ట్ గనులున్నాయి. ఓపెన్ కాస్ట్‌లో భాగంగా భూమి లోపలి పొరల్లో నిక్షిప్తమైన బొగ్గును బయటకు తీసే క్రమంలో ముందుగా భూ ఉపరితలంలో ఉన్న మట్టిని తొలగించాల్సి గనుల స్వభావాన్ని బట్టి టన్ను బొగ్గుకు సగటున ఐదు టన్నుల వరకు మట్టి తొలగించాల్సి ఉంటుంది. ఇలా తొలగించే మట్టిని ఓవర్ బర్డెన్ (ఓబీ)గా పిలుస్తారు. ఓబీ మట్టిని గని వెలుపల పోస్తుంటారు. మొదట్లో మట్టి కుప్పలను భూమి నుంచి 60 మీటర్ల ఎత్తు వరకు పోసేందుకు అనుమతి ఉండేది. తర్వాత 90 మీటర్లకు, మూడేళ్ల కిందట 120 మీటర్లకు పెంచారు. ఇప్పుడు 150 మీటర్లకు పెంచేందుకు ప్రతిపాదనలు సైతం సిద్ధం చేశారు. ఇదే జరిగితే మైనింగ్ కోసం తవ్వే మట్టి గుట్టలు కొండంత ఎత్తులో ఉండనున్నాయి. ఓపెన్ కాస్టు గనుల ప్రాంతంలో అంతా అడవులే ఉంటాయి. ఇక్కడ భారీ వర్షాలు కురిసినప్పుడు దిగువ భాగంలో ఆకస్మికంగా వరదలు వస్తున్నాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు పట్టణంలో ఈ నెల మొదటి వారంలో 25 సెంటీమీటర్ల కంటే ఎక్కువ వర్షపాతం నమోదైంది. ఓబీ మట్టి గుట్టల మీదుగా వచ్చిన వరద రక్షణ కందకాలను దాటుకొని దిగువనున్న మణుగూరు పట్టణంలోకి ప్రవేశించింది. లోతట్టు ప్రాంతం, నాలాలకు ఇరువైపులా వరదలు వచ్చాయి. రామప్ప ప్రాంతంలోనూ ఓపెన్ కాస్ట్ గనులు చేపడితే మట్టి గుట్టల నుంచి వచ్చే వరద నీరు ఒంపుగా ఉండే రామప్ప చెరువు వైపే ప్రవహించే అవకాశం ఉంటుంది. చెరువు ముందు ఉండే రామప్ప ఆలయం వరద ముంపునకు గురయ్యే ప్రమాదం ఉంది. ఇక్కడి ఊరు, అటవీపై వరద పోటెత్తనున్నది.

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీలు పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, టీ రవీందర్‌రావు

‘రామప్ప’ పరిరక్షణకు ఉద్యమిస్తాం

- బొగ్గు గని తవ్వకాల నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి
- ఎమ్మెల్సీలు పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, టీ రవీందర్ రావు

హైదరాబాద్, సెప్టెంబర్ 26 (నమస్తే తెలంగాణ): ఓపెన్ కాస్ట్ మైనింగ్‌తో ములుగు జిల్లా రామప్ప దేవాలయానికి ముప్పు వాటిల్లుతుందని ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి ఆందోళన వ్యక్తంచేశారు. ప్రభుత్వం ఓపెన్ కాస్ట్ మైనింగ్ ప్రతిపాదనను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. రామప్పకు యునెస్కో ఇచ్చిన గుర్తింపు రద్దయ్యే ప్రమాదం ఉందని అన్నారు. ఈ విషయాన్ని స్థానిక ఎమ్మెల్యే, మంత్రి సీతక్క సీఎం దృష్టికి తీసుకెళ్లి బొగ్గుగని తవ్వకం ఆలోచనను విరమింపజేయాలని కోరారు. తెలంగాణ భవన్‌లో గురువారం ఎమ్మెల్సీలు పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, టీ రవీందర్‌రావు మీడియాతో మాట్లాడారు. ఉమ్మడి రాష్ట్రంలోనే 2012లో రామప్ప దేవాలయం సమీపంలో బొగ్గు గని తవ్వకాలను చేపట్టాలని ప్రభుత్వం ప్రయత్నిస్తే ఉద్యమ నాయకుడు కేసీఆర్ నాడు దానిని తీవ్రంగా వ్యతిరేకించారని పోచంపల్లి గుర్తుచేశారు. రామప్ప చెరువులకు దేవాదుల నీటిని తరలించేందుకు సొరంగాలు తవ్వాలన్న ఇంజనీర్ల ప్రతిపాదనకు ప్రత్యామ్నాయంగా పైప్‌లైన్ ద్వారా నీటిని తీసుకొచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. కేసీఆర్ సీఎంగా ఉన్న సమయంలోనే రామప్ప ఆలయానికి యునెస్కో గుర్తింపు వచ్చే విధంగా కృషి చేశారని తెలిపారు. రామప్ప దేవాలయాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేయడానికి ఎన్నో నిధులు వెచ్చించారని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మళ్లీ రామప్ప ఆలయం సమీపంలో ఓపెన్ కాస్ట్ మైనింగ్‌ను చేపట్టడానికి హడావుడిగా ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. పేలుళ్లు చేపడితే దేవాలయానికి ప్రమాదం జరుగుతుందని చెప్పారు. ఒక వేళ ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తే కోర్టుకు వెళతామని, ఆందోళనకు కార్యాచరణను ప్రకటిస్తామని హెచ్చరించారు.

జిల్లా ప్రజలు సహించరు

ఉమ్మడి వరంగల్ జిల్లాలో రామప్ప, సమ్మక్క సారలమ్మ ఆలయాలు, భద్రకాళి, వేయిస్తంభాల దేవాలయం ఎంతో ప్రాముఖ్యమైనవని ఎమ్మెల్సీ రవీందర్‌రావు అన్నారు. చారిత్రక ఆనవాళ్లను చెరిపేయవద్దని కోరారు. అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన రామప్ప ఆలయానికి ఓపెన్ కాస్ట్ మైనింగ్‌తో తీవ్ర నష్టం వాటిల్లుతుందని చెప్పారు. ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తే జిల్లా ప్రజలు సహించని హెచ్చరించారు. సమావేశంలో బీఆర్‌ఎస్ నేత వాసుదేవరెడ్డి పాల్గొన్నారు.

సమీక్షలో అధికారులను నిలదీస్తున్న ఎమ్మెల్యే పర్ణికారెడ్డి

సర్కారు మారగానే కరెంటు కోతలా?

- బీఆర్‌ఎస్ ఉన్నప్పుడు 24 గంటలు ఇచ్చి.. ఇప్పుడివ్వరా?
- కరెంట్ డిపార్ట్‌మెంట్ వరెస్ట్..
- ఎమ్మెల్యే పర్ణికారెడ్డి ఫైర్

మరికల్, సెప్టెంబర్ 26: ‘బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో 24 గంటల కరెంట్ ఇచ్చి.. గవర్నమెంట్ మారంగానే ప్రస్తుతం ఎందుకు విద్యుత్తు సరఫరాలో కోతలు పెడుతున్నారు. విధుల్లో అధికారులు నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదు. పనిచేయడం ఇష్టం లేకపోతే బదిలీపై వెళ్లండి’ అంటూ విద్యుత్తు అధికారులపై నారాయణపేట ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి ఆగ్రహం వ్యక్తంచేశారు. గురువారం నారాయణపేట జిల్లా మరికల్ మండల కేంద్రంలోని సూర్య చంద్ర ఫంక్షన్‌హాల్‌లో మరికల్, ధన్వాడ మండలాల అధికారులతో నిర్వహించిన సమీక్షకు ఎమ్మెల్యే హాజరయ్యారు. గత ప్రభుత్వం రైతులకు ఉచితంగా విద్యుత్తు స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు ఇచ్చిందని, ప్రభుత్వం మారగానే అవి ఎందుకు ఇవ్వడం లేదో వివరించాలన్నారు. కరెంట్ రావడం లేదన్నవాళ్ల చేతులు ఎత్తండని ఎమ్మెల్యే సూచించగా అక్కడున్న పలువురితోపాటు ఎమ్మెల్యే చేయి పైకెత్తి విద్యుత్తు శాఖ పనితీరును ఎండగట్టారు.

• కరెంట్ కోసం గిరిజనుల ధర్నా

మూడు రోజులుగా కరెంట్ సరఫరా లేకపోవడంతో గిరిజనులు కన్నెర్ర చేశారు. మహబూబ్‌నగర్ జిల్లా లింగాయిపల్లి అనుబంధ గ్రామం ముందలితండావాసులు గురువారం మహబూబ్‌నగర్-తాండూరు రహదారిపై బైఠాయించారు. - మహ్మదాబాద్

• కాల్మొక్తా సారూ.. ట్రాన్స్‌ఫార్మర్ ఇప్పించండి

‘కాల్మొక్తా సారూ.. ట్రాన్స్‌ఫార్మర్ ఇప్పించండి’ అంటూ యాదాద్రి భువనగిరి జిల్లా గుండాలకు చెందిన రైతు గోపాల్‌దాస్ అయిలయ్య అదనపు కలెక్టర్ బెన్‌షాలోమ్ కాళ్లు మొక్కారు. గురువారం తాసీల్దార్ కార్యాలయానికి వచ్చిన అదనపు కలెక్టర్‌తో ఆయన తన సమస్యను విన్నవించాడు. దీంతో సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. -గుండాల

ఎమ్మెల్యే ఆదినారాయణకు ముచ్చెమటలు!

- కాంగ్రెస్ ఎమ్మెల్యేపై ‘రచ్చబండ’లో ప్రశ్నల వర్షం
- రుణమాఫీ, పింఛన్ల పెంపుపై గ్రామస్థుల నిలదీత
- మైక్ ఇవ్వడానికి కాంగ్రెస్ కార్యకర్తల నిరాకరణ

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మహ్మద్‌నగర్‌లో ఎమ్మెల్యే ఆదినారాయణ చేపట్టిన రచ్చబండలో సమస్యలపై ప్రశ్నిస్తున్న యువకులు, గ్రామస్థులను అడ్డుకుంటున్న కాంగ్రెస్ నాయకులు

చండ్రుగొండ, సెప్టెంబర్ 26: పల్లెల్లో సమస్యలు తెలుసుకునేందుకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ గురువారం చండ్రుగొండ మండలం మహ్మద్‌నగర్ గ్రామంలో చేపట్టిన ‘రచ్చబండ’.. ప్రజల తిరుగుబాటుతో రసాభాసగా మారింది. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు, గ్రామంలో పేరుకుపోయిన సమస్యలు ఎప్పుడు పరిష్కరిస్తారని ఎమ్మెల్యేపై ప్రజలు ప్రశ్నల వర్షం కురిపించారు. దీంతో గ్రామస్థులకు మైక్ ఇవ్వకుండా కాంగ్రెస్ నాయకులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆదినారాయణ మాట్లాడుతూ.. మహ్మద్‌నగర్ గ్రామంలో నెలకొన్న సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకే అధికారుల సమక్షంలో రచ్చబండ కార్యక్రమాన్ని ప్రారంభించానని తెలిపారు. తాను ఈ గ్రామాన్ని దత్తత తీసుకుంటున్నానని, ఏమైనా సమస్యలు ఉంటే చెప్తే.. వాటిని పరిష్కరిస్తారని పేర్కొన్నారు. వెంటనే గ్రామస్థులు కమాల్, లాల్ అహ్మద్, కరీంబీ, హుస్సేన్, బాద్‌షా, అజ్గర్, ఖాసీలు తమ గ్రామంలోని సమస్యలను ఏకరువుపెట్టారు. ప్రభుత్వం ప్రకటించిన విధంగా రైతుల రుణమాఫీ పూర్తిగా కాలేదని, పెంచిన పెన్షన్లను ఎప్పటి నుంచి పంపిణీ చేస్తారని, మహిళలకు ఇస్తామన్న రూ.2,500 ఎప్పటి నుంచి ఇస్తారని ప్రశ్నించారు. గ్రామంలో ఐదు నిమిషాలకోసారి కరెంటు పోతున్నదని, తాగునీరు సైతం సక్రమంగా సరఫరా చేయడం లేదని, కొత్త ఇండ్లు నిర్మించుకుంటే ఇంటి నెంబర్లు ఇవ్వడం లేదని ఆరోపించారు. దీంతో అక్కడే ఉన్న కాంగ్రెస్ నాయకులు గ్రామస్థులను అడ్డుకున్నారు. ఎమ్మెల్యే కలుగజేసుకొని వారిని సముదాయించారు. టెక్నికల్ సమస్యతో రుణమాఫీ కాని వారికి త్వరలోనే అవుతుందని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

ఎన్‌ఎఫ్‌ఐఆర్‌టీడబ్ల్యూ జాతీయ ఉపాధ్యక్షుడిగా ఈదురు వెంకన్న

వర్కింగ్ కమిటీ సభ్యుడిగా పాటి అప్పారావు ఎన్నిక

హైదరాబాద్, సెప్టెంబర్ 26 (నమస్తే తెలంగాణ): నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రోడ్డు ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ (ఎన్‌ఎఫ్‌ఐఆర్‌టీడబ్ల్యూ) జాతీయ ఉపాధ్యక్షుడిగా ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, తెలంగాణ ఆర్టీసీ జాక్ చైర్మన్ ఈదురు వెంకన్న ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బెంగళూరులో రెండ్రోజులు జరిగిన ఎన్‌ఎఫ్‌ఐఆర్‌టీడబ్ల్యూ జాతీయ మహాసభలు గురువారం ముగిశాయి. ఈ సందర్భంగా జాతీయ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. వర్కింగ్ కమిటీ సభ్యుడిగా ఆర్టీసీ ఈయూ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి పాటి అప్పారావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

మింట్‌కాంపౌండ్ వద్ద ధర్నాలో పాల్గొన్న విద్యుత్తు కార్మికులు

ఆర్టిజన్లను రెగ్యులర్ చేయాల్సిందే!

- ఆ తర్వాతే ఇతర ఉద్యోగాలను భర్తీచేయాలి
- తెలంగాణ విద్యుత్తు ఆర్టిజన్ కన్వర్షన్ జేఏసీ డిమాండ్

హైదరాబాద్, సెప్టెంబర్ 26 (నమస్తేతెలంగాణ): రాష్ట్రవ్యాప్తంగా పనిచేస్తున్న 19,587 మంది ఆర్టిజన్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్ కన్వర్షన్ జేఏసీ చైర్మన్ ఈశ్వర్‌రావు, కన్వీనర్ ఎంఏ వజీర్ (ట్రాన్స్‌కో), డిస్కంల యాజమాన్యాలను డిమాండ్ చేశారు. ఇదే డిమాండ్‌తో జేఏసీ ఆధ్వర్యంలో గురువారం 2వేల మంది కార్మికులు హైదరాబాద్ మింట్ కాంపౌండ్ వద్ద ఆందోళనకు దిగారు. ఎస్పీడీసీఎల్ ఆఫీసు ఎదుట 2గంటలపాటు బైఠాయించారు. ప్రభుత్వ, యాజమాన్య వ్యతిరేక నినాదాలు హోరెత్తాయి. వెంటనే న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎస్పీడీసీఎల్ చైర్మన్ ముషారఫ్ అలీకి వినతిపత్రం సమర్పించారు.

కేంద్రం సహకారంతోనే ఇందిరమ్మ ఇండ్లు!

- సమీక్షా సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, సెప్టెంబర్ 26(నమస్తే తెలంగాణ) : కేంద్ర ప్రభుత్వం సహకరిస్తే ఈ ఏడాది ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసేందుకు కూడా సిద్ధంగా ఉన్నామని, ఆయా ఇండ్లపై కేంద్రం బ్రాండింగ్ వేసేందుకు కూడా వెనుకాడబోమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించినట్టు తెలిసింది. ఇందిరమ్మ ఇండ్ల పథకంపై బుధవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ముఖ్యమంత్రి పలు కీలక వ్యాఖ్యలు చేసినట్టు విశ్వసనీయ వర్గాల సమాచారం. రాష్ట్రంలో ఇల్లు లేని పేదల సమగ్ర డాటాను కేంద్రానికి పంపాలని అధికారులకు ముఖ్యమంత్రి సూచించినట్టు తెలిసింది. కేంద్రం ఇచ్చే నిధులకు అదనంగా రాష్ట్రం వాటాగా ఇవ్వాల్సిన నిధులను హౌసింగ్‌బోర్డు భూములు, రాజీవ్ స్వగృహ ఇండ్లు విక్రయించి సమకూర్చుకోవాలని దిశానిర్దేశం చేసినట్టు సమాచారం.

ఏఈఈలకు ఉద్యోగ నియామకపత్రాలు

హైదరాబాద్, సెప్టెంబర్ 26 (నమస్తే తెలంగాణ) : ఇరిగేషన్ శాఖలో సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్, అగ్రికల్చర్ విభాగాల్లో కలిపి దాదాపు 700 మంది అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్(ఏఈఈ)లను ఎంపిక చేయగా, జలసౌధలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి, ఇరిగేషన్‌శాఖ మంత్రి ఉత్తమ్‌తో కలిసి వారికి నియామకపత్రాలు అందజేశారు. అనంతరం సీఎం రేవంత్ మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజల భావోద్వేగం నీళ్లతో ముడిపడి ఉందని, అందుకు అనుగుణంగా నీళ్లను ప్రజలకు అందించాల్సిన బాధ్యత ఇంజినీర్లపై ఉందన్నారు. అనంతరం ఇరిగేషన్ ఉన్నతాధికారులతో భేటీ అయ్యారు. సాగునీటిపారుదలశాఖ కార్యదర్శి రా హుల్ బొజ్జా, ప్రత్యేక కార్యదర్శి జీవన్‌పాటిల్, ఈఎన్సీలు, చీఫ్ ఇంజినీర్లు పాల్గొన్నారు.